# 'ఫాలౌట్'

బస్తీనుండి వచ్చిన బావమరిదిని వెంటపెట్టుకొని రాయన్న వంగతోటకు వెళ్ళాడు. బావమరిది వనమయ్య ఏదో పత్రికకు రిపోర్టరుగా పని చేస్తున్నాడు.

"ఏరా, పోర్టరు పెద్ద గ్రేడా. రిపోర్టరు పెద్ద గ్రేడా?" అని రాయన్న వనమయ్యపై ఛలోక్తి విసిరినప్పుడు వాళ్ళ పల్లెటూరివాళ్ళు మందహాసంచేసేవాళ్ళు.

వనమయ్య శలవుమీద వున్నాడు. అతను కావటానికి చిన్న రిపోర్టరే అయినా పెద్ద ఆలోచనలు కలవాడు. అతనికి ఒకటే చింత, అమెరికాలో పుట్టకపోతినే అని.

ఇదే అమెరికను రిపోర్టరయితే శలవులు వూరికే పోనిస్తాడా? బోలెడంత "పిండి" పోగుచేసి ఒకపుస్తకం రాసి యిరవై వేల డాలర్లకు అమ్మేసే పని!

అసలు అమెరికను రిపోర్టరు శలవుల్లో బావగారి వంగతోట చూడబోతాడా? షేమ్!

ఆవును బీడు మధ్య ఒక గుంజకు పొడుగుపాటి పలుపుతో కట్టేస్తారు. అది యెంత మేర మేసేది ఆ పలుపు పొడుగే నిర్ణయిస్తుంది.

వనమయ్య శలవుల్లో "మేత"కు ఎంత దూరం వెళ్ళేదీ వనమయ్య జీతమే నిర్ణయించింది... ఇంకా ఆవు నయం, అది గుంజకు అన్ని దిక్కులా స్వేచ్ఛగా తిరిగి మేస్తుంది. వనమయ్య ఒక్క దిక్కుగానే పోగలడు. మరీ హెచ్చుదూరం వెళ్ళాడంటే పలుపు తెగుతుంది. వెనక్కు తిరిగి రావటానికి "తైలం" వుండదు.

పల్లెటూరు గనుక చేద్దామన్నా ఖర్చు వుండదనీ, బావమరిది వూరుగనుక తనకు అన్నీ జరిగిపోతాయనీ వనమయ్య యిక్కడికి వచ్చాడన్నమాట.

తెల్లవారుగట్ట గాలి మంచు వాసన కొడుతున్నది. యేనాడూ పత్రికలు చదివి, రాజకీయాలు చర్చించని వంగ మొక్కలు అశాంతి అన్నది యెరగకుండా జీవితాన్ని తమలోని ప్రతి రంధ్రంతోనూ ఆస్వాదిస్తున్నాయి.

"ఈ ప్రాంతంలో ఒక్క హైడ్రోజను బాంబు పేలితే?" అనుకున్నాడు వనమయ్య.

వెంటనే అతనికి తన మనసులో మొలిచిన ప్రశ్న మూడు కాలముల డబుల్ లైనుగా మనోనేత్రం ముందు ప్రత్యక్షమయింది.

"ఈ ప్రాంతంలో ఒక్క హైడ్రోజన్ బాంబు పేలితే–"

దాని కింద "ఒక విలేఖరి భావన" అని చిన్న అక్షరాలతో కనిపించింది. సహజంగా వనమయ్య తన పేరు దాచుకుంటాడు.

పుస్తకం కాకపోతే పోయింది, ఒక వ్యాసం - వ్యాస పరంపర అయితే మరీ బాగుండదూ?

"ఈ ప్రాంతంలో" శీర్షికను "ఒక హైడ్రోజన్ బాంబు పేలితే" "ఒక మహానగరం యేర్పాటైతే" "ఒక సహకార వ్యవసాయ క్షేత్రం యేర్పాటు చేస్తే" యిలాగ వ్యాస పరంపర రాయవచ్చు. కొంచెం ఆలోచిస్తే అయిదారు వ్యాసాలు తట్టుతాయి. అన్నీ కలిపి అచ్చేస్తే అదే పుస్తకం.

ముఖ్యమైన విషయమేమిటంటే వ్యాసాలలో గ్రామీణుల జీవితమూ మనస్తత్వమూ చక్కగా ప్రతిబింబించాలి.

వనమయ్యకు గ్రామంలో ఉండే మామూలు రైతులూ, పాలేర్లూ, యితర కుల వృత్తులు చేసుకునేవారూ వ్యక్తిత్వ రహితులల్లే కనపడేవాళ్ళు. వాళ్ళను గురించి తెలుసుకునేటందుకేమీ లేదు.

ఆ వూళ్ళో చెప్పుకోదగినవాళ్ళు ఐదారుగురే వున్నారు. బాగా ధనికుడూ, ఇరవైయేళ్ళ క్రితం యువకుడూ అయిన భుజంగం వున్నాడు. అతను ఒకప్పుడు జస్టిస్ పార్టీ, తరువాత రాయిస్టు, ప్రస్తుతం ఖోరమిస్టు. కాని, మొదట నుంచి కడదాక మాంచి కమ్యూనిస్టు వ్యతిరేకిస్టు. ఊళ్ళో అందరికన్నా అతని రాజకీయ గొంతు బలిష్టమైనది. స్థానిక కాంగ్రెసు వాది తిలక్‌గాంధీ సిద్ధాంతాలు చర్చించేవాడు కాదు. "కాంగ్రెస్ పదవిలోకి వచ్చినాక ప్రజలకు రాజకీయాలతో యేంపని? పరాయివాళ్ళు పరిపాలిస్తుంటే నూటికి అయిదుగురు కూడా రాజకీయాలు మాట్లాడేవారు కారు. ప్రభుత్వాలు వచ్చినాక నూటికి తొంభై మంది రాజకీయాలు మాట్లాడేవాళ్లే! ఎందుకంట?" అనేవాడు తిలక్‌గాంధీ.

"నువు చెప్పేది ఆ అయిదుగురు కూడా రాజకీయాలకు తిలోదకాలివ్వాలనేనా?" అని అడిగేవాడు స్టాలిన్ లెనిన్, ఆ వూరి కమ్యూనిస్టు నాయకుడు.

సాధారణంగా స్టాలిన్ లెనిన్ మాట్లాడితే యెవరూ వినిపించుకునేవారు కాదు. సంవత్సరానికి 364 రోజులు తమ వూళ్లో అటువంటి మనిషే లేనట్లు నటించి, ఒక్క రోజున అతను తప్ప వూళ్లో యింకొక విషయమే లేనట్టుగా మాట్లాడుకునేవాళ్ళు ఆ వూరివాళ్ళు....

వంగతోట మధ్యగా బావమరుదులు నడుస్తున్నారు. రాయన్న ముందూ, వనమయ్య వెనకా.

"బావా!" అన్నాడు వనమయ్య అకస్మాత్తుగా ఆగి.

"ఒరే, ఆపాటి కూడా తెలియదట్రా? ఎక్కడన్నా బావా అనుగాని వంగతోట దగ్గిర – " అంటూ రాయన్న తన పల్లెటూరి "విట్" విసిరాడు.

ఐతే వనమయ్యకు రాయన్న మాటలు వినబడినట్టు లేదు. అతను వంగి ఒక వంగ మొక్కను పెద్ద కళ్ళతో తదేకంగా చూస్తున్నాడు.

"ఏమిట్రా అది?" అన్నాడు రాయన్న, బస్తీవాళ్ళు పనికిమాలిన వాటి కన్నిటికీ ప్రాముఖ్యం యిస్తారన్న భావం స్ఫురించే గొంతుతో.

"ఈ ఆకు మీద ఏమిటి?" అన్నాడు వనమయ్య కొంచెంగా వణుకుతున్న గొంతుతో.

"ఆకు మీద ఏమి ఉంటుందిరా? ఏదన్నా మట్టో, తెగులో, గుడ్డో అయి వుంటుంది" అన్నాడు రాయన్న.

"కాదు, వచ్చి చూడు, నీకే తెలుస్తుంది" అన్నాడు వనమయ్య.

'నా మొహం' అని మనసులోనే అనుకుని రాయన్న దగ్గిరికి వెళ్ళి చూశాడు, కాని ఆయనకేమీ వింత కనిపించలేదు.

"ఏదో బూడిదలాగుంది" అన్నాడాయన.

"సరిగా చూడు. మామూలు బూడిద యెక్కడన్నా అట్లా ఉంటుందా?" అన్నాడు వనమయ్య.

"ఏడిసినట్టుంది. బూడిదలో మామూలు బూడిదా, అమామూలు బూడిదా ఉంటుందా ఏమిటి?" అన్నాడు రాయన్న.

"ఇదేనా నీకు తెలిసింది; ఇది అమామూలు బూడిదే. నన్నడిగితే 'ఫాలౌట్" అన్నాడు వనమయ్య.

"ఏం లౌటూ?" అంటూ రాయన్న ఆ బూడిదను వేలితో తాకబోయాడు. వనమయ్య ఆయనను రెక్క పట్టుక గుంజాడు. ఇద్దరూ కింద పడ్డారు.

"ఏమిట్రా నువ్వూ?" అని రాయన్న విసుక్కుంటూ లేచాడు.

"అది తాకావంటే యెముకలన్నీ పుచ్చిపోతాయి. రక్తం విరుగుతుంది. జపానులో అయిదు లక్షల మంది యీ బూడిద సోకే చచ్చారు. ఒక పడవలో చేపలు పట్టేవాళ్ళ మీద యీ ఫాలౌట్ పడితే –"

రాయన్నకు యీ పాటికి తన బావమరిదికి మతిపోయిందన్న అనుమానం కలగసాగింది.

"నువు చెప్పేది ఒక్కటీ నేను నమ్మను!" అన్నాడు మొదట.

వనమయ్య పదినిమిషాలు గుక్కతిప్పుకోకుండా మాట్లాడిన తరువాత, "అదీ యిదీ ఒకటి అయివుండదు" అన్నాడు.

"ఇదే యింకోదేశంలో అయితే పొలంఖామందు యే పత్రికకో టెలిఫోన్ చేసేవాడు. వాళ్ళు రిపోర్టర్లను పంపేవాళ్ళు. వాళ్ళు వచ్చి ఫోటోలు తీసుకుని ప్రభుత్వానికి పంపేవాళ్ళు. ప్రభుత్వం సైంటిస్టులు గీగర్ కౌంటర్‌తో వచ్చి, ఇది స్ట్రాంటియం తొంభయ్యో కోబాల్టు అని అరవయ్యో క్షణంలో తేల్చేసేవాళ్ళు!" అన్నాడు వనమయ్య.

అంతా విని రాయన్న "సరే, యింటికిపోయినాక యేంచెయ్యాలో ఆలోచింతాంలే!" అన్నాడు.

"ఈ మొక్కను గుర్తుపెట్టుకోవాలి. ఈ పొలంలో పనిచేసేవాళ్ళతో యీ మొక్కను ముట్టుకోవద్దని చెప్పాలి. ఈ యేటికి యీ వంగతోట కాపు బహుశా అవతల పారెయ్యాలిసిందే. ఈ వంకాయలు తిన్నవాళ్ళు కూడా ఆ రోగాలతో తీసుకుని చస్తారు. ఏమిటనుకున్నావో!" అన్నాడు వనమయ్య. తన బావగారి అనుమానపు కవచాన్ని భేదించటానికి భగీరథయత్నం చేస్తూ.

"నీ మొహం!" ఈసారి రాయన్న పైకే అనేశాడు.

ఆ సాయంకాలం నలుగురు దేవుడిగుడి దగ్గిర చేరారు.

"అది అణుబాంబు భస్మమౌనా కాదా అన్నది నిర్ధారణ అయినదాకా మనం యేమీ చెప్పలేం" అన్నాడు తిలక్‌గాంధీ. ఆయన నిర్లిప్తత చూస్తే ఆ బూడిద బాంబు బూడిద కాదన్న నమ్మకం వున్నట్టుగా కనబడింది.

"అది ఫాలౌట్ అయితే రష్యన్ బాంబు పనే అయివుంటుంది" అన్నాడు భుజంగరావు.

"ఎందుచేతను?" అన్నాడు స్టాలిన్ లెనిన్.

"మీ బాంబులు గొప్పవని మీ కృశ్చేవ్ రోజూ చెబుతూనే వున్నాడుగా!" అన్నాడు భుజంగం.

"చెబితే?" అన్నాడు స్టాలిన్ లెనిన్.

"అమెరికావాళ్ళు క్లీన్ బాంబులు చేస్తున్నారు. దాన్ని బట్టి తెలియటంలా?"

"ఏమిటి తెలిసింది? మన దేశంలో బాంబులు లేకపోయినా బాంబుల మసి మనుషుల తలకాయల్లో మాత్రం చేరింది!"

మాట మీద మాట వచ్చింది.

"అహింస! అహింస!" అన్నాడు తిలక్ గాంధీ.

కాని మాట మీద మాట పెరిగింది. జనం గుమికూడారు. ఒకేసారిగా భుజంగమూ, స్టాలిన్ లెనిన్ ప్రజలను ఉద్బోధించసాగారు.

"మనం బాంబుల భస్మం చూసి భయపడరాదు. కమ్యూనిజం నిర్మూలించటానికి బాంబుల మసి ఒకటే మార్గమైతే ప్రతి గ్రామం మీద మసి పడినప్పటికీ – "

"యుద్ధోన్మాదుల దురహంకారాలవల్ల, పెట్టుబడిదారీని నిలబెట్టటానికి సామ్రాజ్యవాదులు మానవజాతిని సయితం నిర్మూలించే ప్రయత్నంలో–"

"అసలు మన వూళ్ళో యీ కమ్యూనిస్టు చీడ యేమిటంటారు? ఆ మాట నాకు ముందు చెప్పండి!"

"కమ్యూనిస్టు వ్యతిరేకతతో మన కళ్ళు పొరలు కప్పుకుపోయినంతకాలం మనకు అణుబాంబుల భయం వుండనే వున్నది!"

పోట్లాట మొదట్లో ప్రేక్షకుల అంచున ఆరంభమయింది. తర్వాత అది చెయిన్ రియాక్షన్ పద్ధతిలో గుంపుకంతకీ వ్యాపించింది.

ఒకరిద్దరికి తలకాయలు పగిలాయి. ఇద్దరు ముగ్గురికి కాళ్ళూ చేతులూ విరిగాయి.

"ఒరే రాత్రి బండి అందుతుంది. వెంటనే భోజనం చేసి నీవు బయలుదేరు. పెద్దవాణ్ణో, చిన్నవాణ్ణో చెబుతున్నా!" అన్నాడు  రాయన్న.

ఆదరాబాదరా అన్నం తినటంలో తాను తోట వంకాయ కూర తింటున్నానని వనమయ్య గమనించలేదు. ఆ సంగతి రైల్లో గుర్తుకొచ్చింది. వనమయ్యకు చెమటలు పోశాయి. కాళ్ళూ చేతులూ పీకుతున్నట్లు తోచింది.

పట్నం చేరుతూనే వీధిలో వున్న డాక్టరు దగ్గిరికి వెళ్ళి పరీక్ష చేయించుకున్నాడు. డాక్టరు పాతిక రూపాయలు తీసుకుని "ఆమూలాగ్ర పరీక్ష చేసి" ఏమీ జబ్బు లేదన్నాడు.

వనమయ్య బిడియపడుతూ తాను ఫాలౌట్ వంకాయ కూర తిన్నట్టు అనుమానంగా వుందన్నాడు.

డాక్టరు నవ్వలేదు.

"అదా? దాని లక్షణాలు మూడు నెల్లదాకా బయట పడకపోవచ్చు. ఆరు నెల్ల తరువాత బయటపడినా పడవచ్చు!" అన్నాడాయన.

ఇదంతా జరిగి యింకా నెల కూడా కాలేదు.

పాపం వనమయ్య గతి యేం కానున్నదో!

***ముద్రణ: కొడవటిగంటి కుటుంబరావు కథలు, 1960 -63 మధ్య?***

***జయా పబ్లికేషన్స్, విజయవాడ***